వైభవంగా వేణుగోపాలస్వామి రథోత్సవం

నగరంపాలెం: కొత్తపేట(పశువుల ఆస్పత్రి ఎదురు)లోని జగన్నాథస్వామి దేవస్థానంలో రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం వేణుగోపాలస్వామికి పచ్చకర్పూరంతో అలంకరించారు. గరుడ వాహనంపై గ్రామోత్సవం, మన్యుసూక్త హోమం నిర్వహించారు. రాత్రి గుంటూరు నగర పుర వీధుల్లో స్వామి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున్న తరలివచ్చారు. స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులు కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. జగన్నాథస్వామి, ఆంజనేయస్వామి, వెంకటేశ్వర స్వామి దేవస్థానాల చైర్మన్ సూరినేడి దుర్గావరప్రసాద్, సహాయ కమిషనర్(ఈఓ) డి.శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి సభ్యులు, అర్చకులు శ్రీఅయోధ్యఅయ్యప్ప పాల్గొన్నారు.


మోహిని అలంకారంలో స్వామివారు

మోహిని అలంకారంలో..
లాలాపేటలోని పద్మావతి ఆండాళ్ సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం నిర్వహించారు. భక్తుల దర్శనార్థం స్వామికి మోహిని అలంకారం చేశారు. ఉదయం 7 గంటలకు నిత్య హోమం బలిహరణ, 108 కలశాలతో అష్టోత్తర కలశ సపన అభిషేకాలు నిర్వహించారు. రాత్రి హనుమత్ వాహనంపై గ్రామోత్సవం అత్యంత వైభవంగా చేపట్టారు. ప్రధాన ప్రాంతాల్లోని దుకాణదారులు, భక్తులు స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో జగన్నాథ, ఆంజనేయస్వామి, వేంకటేశ్వరస్వామి దేవస్థానాల చైర్మన్ సూరినేడి దుర్గావరప్రసాద్, సహాయ కమిషనర్ (ఈఓ) డి.శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి సభ్యులు, దేవస్థానం అర్చకులు ఆర్‌టీఆర్‌వీ ప్రసాద్, శ్రీనివాసా చార్యులు, మురళీచంద్రకుమార్ పాల్గొన్నారు.


స్వామి దివ్య రథోత్సవం

క్లుప్తంగా

ప్రభుత్వ ఆస్పత్రి ఉద్యోగి ఉదారత

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ అభివృద్ధికి దాతలు మరింతగా ముందుకు రావాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ అన్నారు. ఆస్పత్రిలో ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్న ఉస్మాన్ మంగళవారం రూ.7 వేలు విలువ చేసే ఈసీజీ పేపర్ రోల్స్‌ను సూపరింటెండెంట్‌కు అందజేశారు. డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ గతంలో ఉస్మాన్ రూ.10 వేలు విలువ చేసే పేపర్ రోల్స్ అందించారని గుర్తు చేశారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

గుంటూరు ఈస్ట్: విద్యుదాఘాతంతో మహిళ మృతి చెందిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. గౌతమీ నగర్‌లో నివాసం ఉండే కడియం లూర్దు మేరి(47) నీటి మోటారుకు పైపు అమర్చుతుండగా సోమవారం షాక్‌కు గురైంది. ఘటనా స్థలంలోనే ఆమె మృతి చెందింది. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రైవేట్ విద్యా సంస్థల బస్సుల తనిఖీ



పట్నంబజారు: విద్యా సంస్థలకు చెందిన బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు లేని వాహనాలపై ఆర్టీఏ అధికారులు కొరడా ఝుళిపించారు. జిల్లాలో విస్తృత తనిఖీలు చేపట్టి బస్సులపై కేసు నమోదు చేస్తున్నారు. దానిలో భాగంగా మంగళవారం జిల్లా వ్యాప్తంగా తనిఖీలు నిర్వహించి అనుమతులు తీసుకొని నిబంధనలు ఉల్లంఘించిన 15 బస్సులు, 60 ఏళ్లపై బడి వాహనాలు నడుపుతున్న డ్రైవర్‌కు సంబంధించి ఒక కేసు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్(ఎఫ్‌సీ) లేనివి రెండు కేసులు కలిపి మొత్తం 18 కేసులు నమోదు చేశారు. విద్యా సంస్థలకు సంబంధించి ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు తప్పనిసరిగా తీసుకోవాలని డీటీసీ షేక్ కరీం కోరారు. లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా తనిఖీలు నిర్వహించి జరిమానా విధించడంతో పాటు, వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు.

చేబ్రోలులో భారీ వర్షం

చేబ్రోలు: ఉదయం తీవ్రమైన ఎండ, ఉక్కపోతతో అల్లాడిన ప్రజలకు సాయంత్రం వాతావరణంలో ఒక్కసారిగా వచ్చిన మార్పులతో ఊరట లభించింది. భారీ వర్షం కురవటంతో ప్రజలు సేద తీరారు. చేబ్రోలు మండలంలో మంగళవారం భారీ వర్షం పడటంతో ప్రజలు ఉపశమనం పొందారు. కొద్దిరోజులుగా ఆకాశం మేఘావృతం కావటం, కొద్దిపాటి జల్లులు మాత్రమే కురిసేవి. మంగళవారం ఉదయం నుంచి వేసవి ఎండలా వేడి ఉండటంతో ప్రజలు అల్లాడారు. సాయంత్రం భారీ వర్షం కురిసి చల్లబడటంతో ఉపశమనం పొందారు. ఈ వర్షంతో రైతులు వ్యవసాయ పనులకు సిద్ధమవుతున్నారు.

లీజుకు ఆర్టీసీ డిపో పరిధిలోని దుకాణాలు

తెనాలిఅర్బన్: తెనాలి ఆర్టీసీ డిపో పరిధిలోని పలు షాపులు, ఖాళీ స్థలాలను లీజుకు ఇవ్వనున్నట్లు డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్ తెలిపారు. డిపో ఆవరణలోని తన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆసక్తి ఉన్న వ్యాపారులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు. ప్రయాణికుల సౌకార్యార్థం తెనాలి డిపో నుంచి పలు గ్రామాలకు కొత్త బస్సులు నడపనున్నామని వెల్లడించారు. విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థులకు ఉచిత పాస్‌లు ఇవ్వనున్నట్లు తెలిపారు. డిపో ఆవరణలోని బస్సు పాస్‌ల కౌంటర్‌లో వాటిని పొందవచ్చని చెప్పారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులను చేర్చండి

తాడేపల్లి రూరల్: మూడేళ్లు దాటిన పిల్లలను తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రానికి పంపించాలని పెనుమాక సెక్టార్ సూపర్‌వైజర్ నిర్మల సూచించారు. మంగళవారం ఎంటీఎంసీ పరిధిలోని డోలాస్ నగర్‌లో అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. పర్యవేక్షించేందుకు విచ్చేసిన నిర్మల మాట్లాడుతూ.. 3 సంవత్సరాలు వయస్సు ఉన్న బాలబాలికలను ప్రతి తల్లిదండ్రులు విధిగా అంగన్‌వాడీ కేంద్రానికి పంపించాలని కోరారు. మధ్యాహ్నం భోజన సదుపాయం కూడా చిన్నారుల కోసం ఏర్పాటు చేశామని తెలిపారు. స్మార్ట్ టీవీలో విద్యాబోధన ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ శకుంతల, అంగన్‌వాడీ సిబ్బంది, కార్యకర్తలు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

పశువుల దొంగల పట్టివేత

మేడికొండూరు: గేదెల దొంగలను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. లారీల్లో ఎక్కించుకుని గుట్టుగా తరలిస్తున్నారు. ఈ నేపథ్యంలో బాధిత రైతులు అర్ధరాత్రి సమయంలో నిర్మానుష్య ప్రాంతంలో నిఘా పెట్టారు. సోమవారం రాత్రి 12 గంటల సమయంలో గేదెలు కట్టి ఉన్న ప్రాంతానికి వచ్చిన నిందితులను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసి, వారిని కోర్టులో హాజరుపరిచారు.

'నీట్'పై సమగ్ర విచారణ చేయించాలి

లక్ష్మీపురం: దేశవ్యాప్తంగా వైద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ పరీక్షల్లో అవకతవకలపై సుప్రీం కోర్టు న్యాయమూర్తితో సమగ్ర విచారణ చేయించాలని అవగాహన సంస్థ నిర్వహించిన సమావేశంలో పలువురు వ్యక్తులు కోరారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో మంగళవారం 'నీట్' అవకతవకలపై చర్చ మంగళవారం నిర్వహించారు. సమావేశంలో పేరెంట్స్ అసోసియేషన్ కన్వీనర్ డి.టి.సాయిబాబు మాట్లాడుతూ మే 5న నిర్వహించిన నీట్ పరీక్షను 24 లక్షల మంది రాశారని, వారి భవిత అగమ్యగోచరంగా మారిందన్నారు. కొన్ని రోజులుగా నీట్ స్కామ్‌పై అభ్యర్థులు గగ్గోలు పెట్టడంతోపాటు, న్యాయస్థానాలను ఆశ్రయించినా పట్టించుకోని ప్రభుత్వం చివరికి సుప్రీం కోర్టు నోటీసులు జారీ చేశాక స్పందించి రెండు చోట్ల అక్రమాలు జరిగినట్లు గర్తించామని అంగీకరించిందని వివరించారు. అయితే కుంభకోణంపై విచారణ జరిపిస్తామని గానీ, అభ్యర్థులకు న్యాయం చేస్తామని చెప్పలేదన్నారు. అవేవో సాధారణంగా చోటు చేసుకున్న చిన్న చిన్న తప్పులన్నట్లు పేర్కొనడం బాధాకరమన్నారు. మేధావుల ఫోరం కార్యదర్శి పి.ఎస్.మూర్తి మాట్లాడుతూ కోర్టుల్లో విచారణ సందర్భంగా వెల్లడవుతున్న నీట్ అక్రమాలు అందరినీ నివ్వెరపరుస్తుందన్నారు. సమావేశంలో విద్యావేత్త పోతురాజు, సింగరయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అవగాహన సంస్థ సభ్యులు

మోటూరు హనుమంతరావు చిరస్మరణీయుడు

లక్ష్మీపురం: మోటూరు హనుమంతరావు చిరస్మరణీయుడని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు కొనియాడారు. స్థానిక బ్రాడీపేటలోనీ పార్టీ జిల్లా కార్యాలయంలో దివంగత సీపీఎం నాయకుడు మోటూరు హనుమంతరావు వర్ధంతి మంగళవారం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటం వద్ద పూల మాలలు వేసి నివాళులర్పించారు. రామారావు మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లా భట్టిప్రోలు మండలం వెల్లటూరు గ్రామంలో జన్మించి జాతీయోద్యమానికి ఆకర్షితుడైనట్లు చెప్పారు. 1937లోనే కమ్యూనిస్టు సభ్యునిగా చేరిన ఆయన తనంతరం సీపీఎం అభివృద్ధికి ఎనలేని కృషి చేసినట్లు చెప్పారు. పార్టీ గుంటూరు జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర కార్యదర్శిగా దీర్ఘకాలం పాటు పనిచేశారని గుర్తు చేశారు. జనశక్తి, విశాలాంధ్ర, ప్రజాశక్తి పత్రికలకు సంపాదకునిగా పనిచేసి పత్రికల అభివృద్ధికి, ప్రజాచైతన్యానికి సేవలందించినట్లు పేర్కొన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్.చెంగయ్య మాట్లాడుతూ మంగళగిరి ప్రాంతంలో కమ్యూనిస్టు ఉద్యమ అభివృద్ధికి తనవంతుగా కృషి చేయడమే కాక, నాయకత్వానికి నిరంతరం సలహాలిచ్చే వారని గుర్తుచేశారు. ఆయన స్ఫూర్తితోమతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కె.నళినీ కాంత్, ఈమని అప్పారావు, బి.లక్ష్మణరావు, ముత్యాలరావు, కిరణ్, సాంబశివరావు, కృష్ణకాంత్, ఖాశింషహీద్, మూర్తి పాల్గొన్నారు.


మోటూరు చిత్రపటం వద్ద పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న పాశం రామారావు

అనుమతులు లేని విత్తనాలు అమ్మితే లైసెన్సులు రద్దు

ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలు

అచ్చంపేట: అనుమతి పత్రాలు లేని విత్తనాలు, అలాగే లూజులో విత్తనాలు విక్రయించినా లైసెన్సులు రద్దు చేస్తామని పిడుగురాళ్ల వ్యవసాయ సహాయ సంచాలకులు బి.శ్రీకృష్ణదేవరాయలు విత్తన వ్యాపారులను హెచ్చరించారు. మంగళవారం మండలంలోని విత్తన షాపులలో ఏవో వెంకటేశ్వర్లుతో కలసి ఆయన తనిఖీలు నిర్వహించారు. స్టాక్ రిజిస్టర్లను, స్టాక్ బోర్డులను, ప్రిన్సిపల్ సర్టిఫికెట్లను, విత్తన కంపెనీలకు సంబంధించిన పత్రాలను, ప్రభుత్వం నుంచి పొందిన విత్తన అనుమతి పత్రాలను పరిశీలించారు. స్థానిక శ్రీలక్ష్మీ ఎంటర్‌ప్రైజెస్, తిరుమల ట్రేడర్స్, శ్రీరామసీడ్స్, శ్రీపుల్లారెడ్డి సీడ్స్ తదితర దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విత్తనాలు కొనుగోలు చేసిన ప్రతి రైతుకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలన్నారు. ఆ బిల్లును పంటకాలం పూర్తయ్యేంత వరకు దాచుకునే విధంగా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి లాట్‌కు శాంపిల్స్ తీసి టెస్టింగ్ కోసం ల్యాబ్‌కు పంపడం జరుగుతుందన్నారు. వ్యాపారులు లూజు విత్తనాలను విక్రయించడం నేరమన్నారు. నకిలీ విత్తనాలు అమ్మినట్లు రైతుల నుంచి ఫిర్యాదులందితే వ్యాపారులదే పూర్తి బాధ్యతన్నారు. ప్రతి షాపులో స్టాక్ బోర్డులను ఉంచుకోవాలని సూచించారు. స్టాక్ రిజిస్టర్లను అప్‌డేటెడ్‌గా ఉంచుకోవాలని చెప్పారు. ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.


విత్తన డీలర్లు ప్రిన్స్‌పల్ సర్టిఫికెట్ కలిగి ఉండాలి
క్రోసూరు: విత్తన డీలర్లు తప్పనిసరిగా ప్రిన్స్‌పల్ సర్టిఫికెట్ పొంది ఉండాలని పిడుగురాళ్ల ఏడీఏ బి.కృష్ణదేవరాయలు అన్నారు. మంగళవారం క్రోసూరులోని పలు విత్తన దుకాణాలను క్రోసూరు ఏవో వేణుగోపాల్‌తో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ డీలర్లకు పలు సూచనలు చేశారు. విత్తనాల డీలర్లు తాము తెచ్చుకున్న విత్తనాలకు ఉత్పత్తి దారు నుంచి ప్రిన్స్‌పల్ సర్టిఫికెట్ పొంది ఉండాలన్నారు. అలా సర్టిఫికెట్ పొందకుండా ఉంటే విత్తనాల విక్రయాలు నిలిపి వేసి సదరు డీలరుపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.


అదే విధంగా విత్తన డీలర్లు విత్తనాల రకాలు, ధరలు సూచిక బోర్డు తప్పనిసరిగా పెట్టాలన్నారు. విక్రయించిన విత్తనాలకు సంబంధించి లాట్ నంబర్, బ్యాచ్ నంబర్, గడువు తేదీ బిల్లుపై రాసి రైతు సంతకం లేదా వేలిముద్ర తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. రైతుకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలన్నారు. రైతు అడిగిన విత్తనాలు మాత్రమే ఇవ్వాలని, వారిని మభ్యపెట్టి తమ దగ్గర ఉన్న విత్తనాలు విక్రయించుకూడదని అన్నారు. పై విధంగా విత్తన డీలర్లు నిబంధనలు పాటించాలని లేకుంటే 1966 విత్తన చట్టం ప్రకారం చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు.


దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏడీఏ, ఏవో

పలు పోటీల్లో ఎన్‌సీసీ క్యాడెట్ల ప్రతిభ

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి రూరల్ వడ్డేశ్వరంలోని కేఎల్ విశ్వవిద్యాలయంలో ఎన్‌సీసీ రాజస్థాన్, ఆంధ్ర, తెలంగాణ డైరెక్టరేట్‌లకు చెందిన క్యాడెట్‌లకు వివిధ రకాల క్రీడలతోపాటు చర్చా వేదిక పోటీలను నిర్వహించారు. జరుగుతున్న ఏక్ భారత్ – శ్రేష్ఠ భారత్ రెండో కార్యక్రమంలో భాగంగా మంగళవారం వీటిని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా క్యాంప్ కమాండెంట్ కల్నల్ ఎస్ఎం చంద్రశేఖర్ మాట్లాడుతూ ఏక్ భారత్– శ్రేష్ఠ భారత్ ద్వారా దేశంలోని ఆయా ప్రాంతాలకు చెందిన యువతను ఒక వేదికపైకి చేర్చి వారికి భిన్నత్వంలోని ఏకత్వమైన భారత సమైక్యతను చాటిచెబుతున్నట్లు వివరించారు. ఈ పోటీలలో క్యాడెట్‌లు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను కనబరిచారని అన్నారు. కార్యక్రమంలో క్యాంప్ కమాండెంట్ కల్నల్ సీఎస్ సిద్ధు, డిప్యూటీ క్యాంపు కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ ఎస్‌వీఎస్ సుదర్శన్, కేఎల్‌యూ ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ పావని తదితరులు పాల్గొన్నారు.


క్రీడల్లో పాల్గొన్న ఎన్‌సీసీ క్యాడెట్లు


చర్చా వేదికలో పాల్గొన్న క్యాడెట్లు

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

పొన్నూరు : విద్యాభివృద్ధికి టీడీపీ ప్రభుత్వం కృషి చేస్తుందని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ సతీమణి జ్యోతిర్మయి అన్నారు. మండలంలోని చింతలపూడి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్టూడెంట్ కిట్ పేరుతో ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న పాఠ్య, నోట్ పుస్తకాలతో పాటు స్కూల్ బ్యాగ్ ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జ్యోతిర్మయి మాట్లాడుతూ పేద విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతోందని అన్నారు. తల్లిదండ్రులు తప్పక తమ పిల్లలను బడిబాట పట్టించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

బాపట్లటౌన్: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈఓ ఎస్.నిరంజన్ పేర్కొన్నారు. మండలంలోని దరివాదకొత్తపాలెం మున్సిపల్ యూపీ స్కూల్‌లో మంగళవారం పాఠశాల ఉపాధ్యాయుడు యామినేని నాగార్జునరావు రచించిన నేను బడికిపోతా ప్రతులను ఆవిష్కరించారు. ఎంఈఓ ఎస్.నిరంజన్ మాట్లాడుతూ బడి ఈడు కలిగిన విద్యార్థులందరిని సర్కార్ పాఠశాలల్లోనే చేర్పించాలని, ప్రభుత్వం అందిస్తున్న అమ్మకు వందనం, స్టూడెంట్స్ కిట్స్, ఏండీఎం, పీఎం పోషణ, నాణ్యమైన విద్యను అర్హత గల ఉపాధ్యాయుల నుంచి పొందాలన్నారు. పిల్లలను బడిలో చేర్పించాలంటూ నాగార్జునరావు రచించిన ఈ పాట విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. సీఆర్పీలు అనిల్, జాన్ వెస్లీ, రవి కిరణ్, నాగరాజు, శ్రీదేవి, ఇందిరా, లలిత, పద్మజ పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో ఖాళీలకు దరఖాస్తులు

ప్రిన్సిపాల్ కె.పాపయ్య

జెట్టిపాలెం(రెంటచింతల): మండలంలోని జెట్టిపాలెం సమీపంలో నున్న ఏపీ మోడల్ స్కూల్ అండ్ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి 6, 7, 8, 9 తరగతులలో నున్న ఖాళీల ప్రవేశానికి విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కె.పాపయ్య తెలిపారు. మంగళవారం ఆయన పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ విద్యార్థులు (ఆఫ్‌లైన్) స్కూల్‌లోనే దరఖాస్తు పూర్తిచేసి ఇవ్వాలన్నారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్, ప్రతిభ ఆధారంగా సీట్లు కేటాయించడం జరుగుతుందన్నారు. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్ ఫస్ట్ ఇయర్, సెకండ్ ఇయర్‌లో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపులలో నున్న ఖాళీలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం సీట్లు కేటాయించడం జరుగుతుందన్నారు.

ఖాళీలు ఇలా..
6వ తరగతిలో 30 ఖాళీలు, 7వ తరగతిలో 32 ఖాళీలు, 8వ తరగతిలో 33, 9వ తరగతిలో 28, ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో 20, సెకండ్ ఇయర్‌లో 31 ఖాళీలు ఉన్నాయన్నారు. పూర్తిగా ఇంగ్లిష్ మీడియంలోనే బోధన ఉంటుందన్నారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. పూర్తి వివరాలకు పాఠశాలలో ప్రిన్సిపాల్ నంబర్ 9182958496ను సంప్రదించాలని తెలిపారు.

సక్రమంగా పారిశుద్ధ్య పనులు చేపట్టాలి

- ఎంటీఎంసీ కమిషనర్ నిర్మల్ కుమార్
- సచివాలయ సెక్రటరీలకు పలు సూచనలు

తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధిలోని ఉండవల్లి, నులకపేట, ఉండవల్లి సెంటర్ పరిధిలోని సచివాలయాలను మంగళవారం ఎంటీఎంసీ కమిషనర్ నిర్మల్ కుమార్ సందర్శించారు. పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సచివాలయ సెక్రటరీలతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సమయ పాలన పాటించాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. పారిశుద్ధ్య పనులను ప్రతిరోజు చేయాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. రహదారులపై ఆక్రమణలు జరగకుండా ప్లానింగ్ సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలన్నారు. రోడ్లపై అనధికారంగా ఎలాంటి తాత్కాలిక నిర్మాణాలు, ఇతర నిర్మాణ సామగ్రి వేయకుండా చూడాలని పేర్కొన్నారు. రోడ్లపై అక్రమంగా తోపుడు బండ్లు, బడ్డీ కొట్లు వంటివి ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏ సమయంలోనైనా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు సచివాలయాలకు ఆకస్మికంగా తనిఖీ చేసే అవకాశం ఉందని తెలిపారు. రికార్డులను సిద్ధం చేయాలని సూచించారు. ఎవరైనా విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.


పుష్కర ఘాట్ల వద్ద పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న ఎంటీఎంసీ కమిషనర్ నిర్మల్ కుమార్

విద్యాసామగ్రి అందజేత


నుదురుపాడులో సామగ్రి అందజేస్తున్న షేక్ మస్తాన్ వలి


పుస్తకాలు పంపిణీ చేస్తున్న వేమవరం సర్పంచి ఎం. శివకుమారి

ఫిరంగిపురం: మండలంలోని నుదురుపాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు విద్యాసామగ్రి బ్యాగ్, పుస్తకాలను విద్యాకమిటీ చైర్మన్ షేక్ మస్తాన్‌వలి అందజేశారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత విద్యావంతులు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఏవీవీ లక్ష్మి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఫిరంగిపురంలో..:
మండల కేంద్రంలోని సెయింట్ పాల్స్, సెయింట్ ఆన్స్ పాఠశాలల్లో మంగళవారం విద్యార్థులకు విద్యాసామగ్రి కిట్లను అందజేశారు. కార్యక్రమంలో కె.కోటేశ్వరరావు. మండవ నరసింహారావు, బాబు, పి.ప్రకాష్, నారాయణ, శేషు పాల్గొన్నారు.

వేమవరంలో..:
గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గ్రామ సర్పంచి మున్నంగి శివకుమారి విద్యార్థులకు విద్యాసామగ్రి కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వం అందజేస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం దివి కమల్‌మోహన్, తల్లిదండ్రుల విద్యాకమిటీ చైర్మన్ పి.రామిరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

కాలువల్లో వ్యర్థాలను పూర్తిగా తొలగించండి

మున్సిపల్ కమిషనర్ శేషన్న

తెనాలిఅర్బన్: మురుగు కాల్వల్లోని వ్యర్థాలను పూర్తిగా తొలగించాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశించారు. చిట్టి ఆంజనేయ స్వామి గుడి వద్ద జరుగుతున్న పూడికతీత పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. కాల్వల్లో పారుదల ఉండే విధంగా చూడాలని ఆదేశించారు. అనంతరం చినరావూరు పార్కును సందర్శించారు. పార్కులో ఏర్పాటు చేయాల్సిన మరిన్ని వసతులపై ఆరా తీశారు. అనంతరం చినరావూరుతోటలో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులలను, వీఎస్సార్ కళాశాల సమీపంలోని పైకాస్ పార్కును పరిశీలించారు. మరిన్ని మొక్కలను నాటాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట డీఈలు సుబ్బారావు, నాగభూషణం, ఏఈ ఫణీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు, శ్రీనివాసరావు, హార్టికల్చర్ ఆఫీసర్ శేషుబాబు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.


పూడికతీత పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శేషన్న

బీసీలకు మరింత మేలు జరిగేలా చూడండి

తెనాలిఅర్బన్: ప్రభుత్వ పథకాల్లో బీసీల్లో ఎక్కువ లబ్ధి జరిగేలా చూడాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కృష్ణబలిజ సంఘ నాయకులు కోరారు. మంగళవారం బోసు రోడ్డులోని జనసేన కార్యాలయంలో మంత్రిని కలసి అభినందనలు తెలిపి, సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు సంఘ నాయకులు ఉన్నారు.

'నేను బడికి పోతా' ప్రత్యేక డ్రైవ్

చావలి(వేమూరు) : బడి బయట పిల్లలను పాఠశాలల్లో చేర్పించేందుకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారి ఐ.వెంకటేశ్వర్లు తెలిపారు. వేమూరు మండలంలోని చావలి గ్రామంలోని మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో 'నేను బడికి పోతా' కార్యక్రమం ద్వారా పాఠశాలల్లో పిల్లలను చేర్పించినట్లు తెలిపారు. గ్రామాల్లో ఐదేళ్లు నిండిన బాలబాలికలను గుర్తించి వారి పేర్లను పాఠశాలల్లో నమోదు చేయడం జరుగుతుందన్నారు. పాఠశాలలు ఈ నెల 12వ తేదీ పునఃప్రారంభించడం జరిగిందన్నారు. అప్పటి నుంచి ప్రతి గ్రామంలో నేను బడికి పోతా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఆయన చెప్పారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి.మరియదాసు పాల్గొన్నారు.

వామపక్ష నేత నాగేశ్వరరావుకు నివాళి



దొండపాడు (తాడికొండ): తొలితరం కమ్యూనిస్టు నేత నెలకుదిటి నాగేశ్వరరావు జీవితం ఆదర్శనీయమని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, డివిజన్ కార్యదర్శి ఎం రవి అన్నారు. నాగేశ్వరరావు 79వ వర్ధంతిని ఆయన స్వగ్రామమైన తుళ్ళూరు మండలం దొండపాడులో నిర్వహించారు. ఈ సందర్భంగా స్తూపం, సమాధి వద్ద నివాళులర్పించిన అనంతరం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి సీపీఎం పతాకాలను ఆవిష్కరించారు. తర్వాత జరిగిన సభలో రవి మాట్లాడుతూ గుంటూరు జిల్లాలో తొలి తరానికి చెందిన రైతు నాయకులలో ప్రజాదరణ పొందిన ఆదర్శ నాయకుడు నెలకుదిటి అన్నారు. సభలో మాజీ ఎంపీటీసీ నెలకుదిటి వెంకటేశ్వరరావు, మైనేని గిరిజ, సీపీఎం రాజధాని డివిజన్ నాయకులు పేరం బాబురావు, కుంభా ఆంజనేయులు, జే నవీన్ ప్రకాష్, నెలకుదిటి నాగేశ్వరరావు, గూడూరు నాగమల్లేశ్వరరావు, పసుపులేటి శ్రీనివాసరావు, గూడూరు బుల్లిబాబు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.